క్లుప్తంగా

భజన కళాకారులకు సన్మానం


లింగంపర్తిలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న సుబ్బారావు, భజన కళాకారులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శుక్రవారం భజన కళాకారులను ఘనంగా సన్మానించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక వేత్త పాలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో సీతారామ భజన మండలి కళాకారులకు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ భారత దేశ సంస్కృతిని పరిరక్షిస్తున్న భజన కళాకారులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సాయిబాబాక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెంటకోట చంటిబాబు, ఊటుకూరి నానాజీ, కప్పల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల అభివృద్ధికి కృషి చేయాలి

ఏలేశ్వరం: పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ప్రధాన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిపై ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధాన ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడుల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారాన్ని అందించాలని, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యా కమిటీ సమావేశాలను విధిగా నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓలు, అబ్బాయి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రత్తిపాడు రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గోపాల మిత్రాలు కోరారు. ఈ మేరకు గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెండా నానాజీ ఆధ్వర్యంలో శుక్రవారం సామర్లకోటలో పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి, తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో గోపాల మిత్రలకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు హామీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల మిత్రాలు బి.కాశీవిశ్వనాథ్, ఎస్ సతీష్, కె.శరత్, ఏఎస్వీ కృష్ణ, ఎస్ రవి కుమార్, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం పోలీస్‌స్టేషన్‌కు రెండో స్థానం

గోకవరం: పోలీస్ స్టేషన్ నిర్వహణ, ప్రజాసంబంధాల వ్యవహారాల్లో గోకవరం పోలీస్‌స్టేషన్‌కు తూర్పుగోదావరి జిల్లాలో రెండో స్థానం లభించినట్టు ఎస్సై పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 18 పోలీస్‌స్టేషన్లు ఉండగా ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పర్యటనలో పోలీస్‌స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. మెరుగైన పనితీరులో గోకవరం పోలీస్ స్టేషన్‌కు రెండవ స్థానం లభించిందన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్, కోరుకొండ సీఐ సత్యకిశోర్ పర్యవేక్షణలో ఈ ఘనత సాధించినట్టు చెప్పారు.

సారాతో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం దాడులు నిర్వహించి, 60 లీటర్ల సారాతో ముగ్గురు సారా విక్రేతలను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో 40 లీటర్ల సారాతో కందిపల్లి వీరబాబును, ఒమ్మంగిలో 10 లీటర్ల సారాతో పల్లా సత్యవతిని, కిర్లంపూడిలో 10 లీటర్ల సారాతో చిట్టిబోయిన శ్రీనులను అరెస్టు చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సారా స్థావరాలపై తుని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కిర్లంపూడి: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన ఘటనపై శుక్రవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెం గ్రామానికి చెందిన వేమ లచ్చిరెడ్డి కుమార్తె భూలక్ష్మి అలియాస్ భూలోకం(16) తామరాడలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న తమ బంధువు కడబాల దేవిరెడ్డి వద్దకు వెళ్లింది. గురువారం తెల్లవారుజామున భూలక్ష్మి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించిన దేవిరెడ్డి, బట్టీలో పని చేస్తున్న మరికొందరు కలిసి ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తండ్రి లచ్చిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

మెయిన్ రోడ్డు విస్తరణపై నీలినీడలు

- గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు
- పెరిగిన వాహనాలతో ఇబ్బందులు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు


జనంతో రద్దీగా ఉన్న తుని మెయిన్ రోడ్డు

తుని: ప్రభుత్వాలు మారుతున్నా తుని పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జనాభాతో పాటు వాహనాల సంఖ్య రెట్టింపు అయ్యింది. దీనికి అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులు, పోలీసులు కలసి ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రధాన రహదారుల్లో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

మాజీ మంత్రి రాజా కృషితో రూ.54 కోట్ల మంజూరు

తుని పట్టణంలో రెండు దశాబ్దాలుగా మెయిన్ రోడ్డు విస్తరణ జరగలేదు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా విస్తరణ పనులకు రూ.54 కోట్లు నిధులు మంజూరు చేశారు. విస్తరణలో భాగంగా తొలగించాల్సిన భవనాల యాజమానులు కోర్టును ఆశ్రయించడంతో పనులకు అంతరాయం కలిగింది. కొత్త ప్రభుత్వం మెయిన్ విస్తరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

54 వేల జనాభా

తుని పట్టణ విస్తీర్ణం 7.02 చదరపు కిలోమీటర్లు. జనాభా 54 వేల మంది ఉండగా 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ప్రతి కుటుంబానికి వాహనాలు ఉన్నాయి. రవాణా శాఖ అధికారుల సమాచారం ప్రకారం పట్టణంలో 9 వేల ద్విచక్ర వాహనాలు, 276 కార్లు, 115 భారీ వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, పాయకరావుపేట, శంఖవరం తదితర మండలాల నుంచి రోజుకు 25 వేల మంది వివిధ పనులపై తుని పట్టణానికి వస్తుంటారు. పదేళ్లలో వాహనాల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఇందుకు అనుగణంగా రహదారులు లేవు. పట్టణంలో ఐదు ప్రధాన రోడ్లు ఉన్నాయి. వీటిలోనే ఎక్కువ వాహన రాకపోకలు సాగుతున్నాయి. జీఎన్‌టీ రోడ్డు, సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లు కీలకమైనవి. వీటిలో సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్లు విస్తరణ చేశారు. మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లకు ప్రభుత్వం రూ.54 కోట్లు నిధులు మంజూరు చేసినా పనులు జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం స్థలసేకరణ నష్ట పరిహారం ఎక్కువగా ఉండడంతో సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

అసలే ఇరుకైనా రహదారుల్లో భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ జిల్లా పాయకరావుపేట మండలంలో ప్రైవేటు బల్క్ మందుల తయారీ పరిశ్రమ ఉంది. ఇక్కడ తయారైన బల్క్ మందులను కంటైనర్స్‌లో విశాఖపట్నం పోర్టుకు తరలించి, అక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముడి సరకు, రసాయనాలు, మిషనరీ తదితర వస్తువులను పెద్ద ట్రాలీల్లో తుని పట్టణం మీదుగా రవాణా చేస్తున్నారు. పురపాలకసంఘం వాహనాల రాక పోకలను ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో విద్యార్థులు స్కూళ్లకు రాక పోకలు చేస్తారని, ఈ సమయంలో భారీ వాహనాలను నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపట్టాం. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి తలుపులమ్మ అలయం వరకు సెంటర్ డివైడర్ ఏర్పాటు చేశాం. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ మెయిన్ రోడ్డులోకి వ్యాన్‌లు, ఆటోలను అనుమతి లేదు. లోడింగ్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 గటంల వరకు తోపుడు బండ్లు వ్యాపారులకు అనుమతి ఉంది. ప్రజలు సహకరిస్తే అనుకూల ఫలితాలు వస్తాయి. తుని పోలీస్‌స్టేషన్‌లో 45 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కొందరిని ఇతర ప్రాంతాలకు బందోబస్తు కోసం పంపుతున్నాం. దీంతో సిబ్బంది కొరత ఉంది.

– గీతా రామకృష్ణ, సీఐ, తుని

ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేయాలి



పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేయాలి. అదనంగా ఎస్సై, సిబ్బంది అందుబాటులోకి వస్తే మెయిన్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్యే యనమల దివ్య, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడులను కలిసి సమస్యను వివరించాం. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించడానికి చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా చర్యలు తీసుకుంటాం.

– సకురు నాగేంద్ర నెహ్రూ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తుని

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన జల్దాంలో గిరిజనుల భూమిని ఆక్రమించి మైనింగ్ రవాణా కోసం రోడ్డు వేయటానికి సిద్ధపడుతున్న మాఫియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ శ్రేణులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జల్దాం గ్రామానికి చెందిన ఆమూరి చంద్రారెడ్డి అనే గిరిజనుడి భూమిని ఆక్రమించి అక్రమంగా రోడ్డు వేయటంపై ఆందోళన చేపట్టారు. దీనిపై ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అధికారులు స్పందించి తక్షణమే మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నాయకుడు సామిరెడ్డి నారాయణమూర్తి, ఆమూరి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రాజమహేంద్రవరం నుంచి తుని వైపు బైక్‌పై వెళుతుండగా స్థానిక పుత్రచెరువు–నరేంద్రగిరి మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. యువకుని మీదుగా వాహనం దూసుకుపోవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు దేవరపల్లికి చెందిన కర్రి సతీష్ (24)గా పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పరిశీలించారు. రోడ్డు ప్రమాదం నేపథ్యంలో పోలీసులు హైవేపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు కీలకం


తేటగుంటలో రైతులతో కలసి మామిడి పూతను పరిశీలిస్తున్న హెచ్ఓ అరుణ్ కుమార్


తిరుమలాయపాలెంలో జీడిమామిడి రైతులకు సూచనలిస్తున్న హెచ్ఓ రిని

తుని రూరల్: పూత, పిందె దశల్లో ఉన్న మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఎంతో కీలకమని ఉద్యాన అధికారి అరుణ్ కుమార్ అన్నారు. మండలంలోని తేటగుంట, రాజులకొత్తూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. రైతులతో కలసి మామిడి, జీడిమామిడి తోటలను, పూత, పిందెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరాన్ లోపం వల్ల మామిడిలో పూత వచ్చినా ఫలదీకరణం సరిగా లేకపోవడంతో పిందెకట్టు తగ్గిపోతోందన్నారు. బోరాన్ లోపాన్ని నివారిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. లోప నివారణకు రెండు గ్రాముల బోరాక్స్ పొడరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు సకాలంలో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు.

మామిడి, జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోకవరం: మామిడి, జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరుకొండ ఉద్యానవన అధికారి రిని సూచించారు. తిరుమలాయపాలెంలో శుక్రవారం మామిడి, జీడిమామిడి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మామిడి, జీడి మామిడి తోటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. మామిడికి ప్రభుత్వం ఇస్తున్న ఇన్సూరెన్సును రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని మామిడి, జీడిమామిడి తోటలను సందర్శించారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


జగ్గంపేటలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

జగ్గంపేట: గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సంప్రదాయ క్రీడా పోటీలు దోహదపడతాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ ఆవరణలో పోలిసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ క్రీడా పోటీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కబడ్డీ పోటీలకు టాస్ వేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులు, వ్యాయమ ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేటలో నిర్వహిస్తున్న సంప్రదాయ క్రీడలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో యువకులు జూదాల జోలికి పోకుండా, వారిలో దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, ఎస్సై రఘునాథరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.30 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల శర్మ, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంతర్జాతీయ త్రో బాల్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ


మౌనేష్‌ను అభినందిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ అధ్యాపకులు

గండేపల్లి: అంతర్జాతీయ త్రోబాల్ చాంపియన్ షిప్‌లో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థి ప్రతిభ కనబరిచినట్టు ఆదిత్య డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆదిత్యలో ఎంసీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బి.మౌనేష్ ఇంటర్నేషనల్ సీనియర్ త్రోబాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని తమ జట్టు రన్నర్–అప్ స్థానం సాధించడంలో విశేష కృషి చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌనేష్ వ్యక్తి గత విజయంతో పాటు ఆదిత్య సంస్థ క్రీడా పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేసాడన్నారు. ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, రామశ్రీ, ఎం.వంశీ కృష్ణ తదితరులు మౌనేష్‌కు అభినందనలు తెలిపారు.

అపరాల సాగుతో అధిక ఆదాయం

కిర్లంపూడి: అపరాలు, వాణిజ్య పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని పెదాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.దైవ కుమార్ రైతులకు సూచించారు. జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా సింహాద్రిపురంలోని ఏఓ జోకా అమృత అధ్యక్షతన శుక్రవారం పంటల సరళి–ప్రదర్శన క్షేత్రంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దైవ కుమార్ మాట్లాడుతూ బోర్ల సదుపాయం ఉన్న రైతులు వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు, వాణిజ్య పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం 50 శాతం సబ్సిడీపై రైతులకు అపరాల విత్తనాలు పంపిణీ చేశారు. తొలిత విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, మినుము పంటకు తరచూ వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది సురేష్, సునీత, రామకృష్ణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

శంఖవరం: రబీ పంట నమోదును వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన,సె రికల్చర్ సహాయకులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీలో వరి, అపరాల సాగు వివరాలు, రైతుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. పంట కోత ప్రయోగాలు, పీఎం కిసాన్, పొలంబడి, జాతీయ ఆహార భద్రత మిషన్, పంటల బీమా పథకం, ధాన్యం కొనుగోలు, ఎరువుల వినియోగం తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సావిత్రి భాయి ఫూలే అవార్డు


బ్రహ్మానందం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయినులు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం, కేఎస్ కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు పొలమరశెట్టి ఇందూదేవి, నవర ఉషాలక్ష్మిలకు రాష్ట్రస్థాయి సావిత్రి బాయి పూలే అవార్డులు వచ్చాయి. విజయవాడలో శుక్రవారం భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం, ఎన్సీఆర్టీ ప్రొఫెసర్ సూర్ధల్, సినీ నటి రేణుదేశాయ్ చేతుల మీదుగా వారు అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను ఎంఈఓలు ఏవీఎస్ శ్రీనివాస్, ఎం.రామశేఖర్, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ ప్రతినిధులు అభినందించారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి


ఒంటిమామిడిలో దివీస్ కంపెనీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

తొండంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీరప్రాంత మత్స్యకారులు దివీస్ కంపెనీ ప్రతినిధులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాలకు చెందిన మత్స్యకార నాయకులు ఒంటిమామిడి దివీస్ కంపెనీ ప్రతినిధులను కలిసారు. తీరంలో వేలాది మత్స్యకార కుటుంబాలు సముద్రంలో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నాయని, కంపెనీ కారణంగా తమ జీవనోపాధికి విఘాతం కలుగుతోందన్నారు. అనంతరం మత్స్యకారులకు న్యాయం చేసేలా రూపొందించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళతామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మత్స్యకార నాయకులు కోడా రమణ, సీహెచ్.కాశీ, సర్పంచ్ అంగుళూరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాత సావిత్రీబాయి

- ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు
- తొలి మహిళా ఉపాధ్యాయురాలికి ఘన నివాళి


ఏలేశ్వరంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: మహిళల హక్కుల కోసం పోరాడిన సావిత్రీ బాయి పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక తుని నియోజకవర్గ అధ్యక్షుడు పక్కుర్తి గోవిందరావు సూచించారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కు వద్ద శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ ఐక్యవేదిక నాయకులు సావిత్రీ బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ నేరెళ్ల సత్యనారాయణ సౌజన్యంతో 700 మందికి అన్నదానం, 82 మందికి దుప్పట్లు, 50 మందికి చీరలను పంపిణీ చేశారు. బీసీ ఐక్య వేదిక నాయకులు కర్రి వెంకటరమణ, నెల్లిపూడి బ్రహ్మజీ, గౌరి శంకర్, కేవీ రమణ, అత్తి రాము, జీవీవీ సత్యనారాయణ, అత్తి అనంత పద్మనాభం పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత మాజీ, మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్న వర్గాల అభ్యున్నతికి సావిత్రీ బాయి విశేష కృషి చేశారన్నారు. తొలి మహిళా విద్యావేత్తగా మహిళల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇజనగిరి శివప్రసాద్, కోరాడ ప్రసాద్, కావలి శ్రీనివాసరావు, పతివాడ జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సునీత ఆధ్వర్యంలో సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రగడ ప్రయాగ మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే విగ్రహావిష్కరణ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల వద్ద ఉన్న పరివర్తన స్థలంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిభాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ నేత పులిప్రసాద్, వుయ్యూరి నాని, వియ్యపు అప్పలస్వామి, గఫూర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సావిత్రీబాయి చేసిన కృషి ఎనలేనిది

గండేపల్లి: మహిళా సాధికారతకు సావిత్రీబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని మండల యూటీఎఫ్ అధ్యక్షురాలు సీహెచ్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మల్లేపల్లి హైస్కూల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షురాలు లలిత కుమారి, కార్యదర్శి రమాదేవి, హెచ్ఎం సుధా మాధురి తదితరులు పాల్గొన్నారు.


తునిలో సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ ఐక్య వేదిక నాయకులు

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు


అధికారులతో కలిసి ప్రకాష్ సదన్ సత్రాన్ని పరిశీలిస్తున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలోని వివిధ వసతి సత్రాల గదుల్లో బస చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దేవస్థానంలోని ప్రకాష్‌సదన్ తదితర సత్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి సత్రాల్లో ప్రతి గది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈఓ ఆదేశించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.